# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం | జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 23 | బుధవారం | 19-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:23 | Wednesday | 19-8-2026 | Pages:08 | Cost:2/- |







పంజాబ్‌లో 'ఫేక్' లబ్ధిదారుల భాంగ్రా నృత్యం...

## వివాదంలో ఆప్ సర్కార్

- పంజాబ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాంగ్రా నృత్యం
- మోకాలి సర్జరీ లబ్ధిదారులుగా ప్రచారంపై రాజకీయ దుమారం
- నృత్యం చేసిన వారు ఆరోగ్య శాఖ రిటైర్డ్ ఉద్యోగులుగా గుర్తింపు
- ప్రభుత్వ ప్రచార స్టంట్ అంటూ విపక్షాల తీవ్ర ఆగ్రహం
- వృద్ధులను అవమానించారని కాంగ్రెస్, అకాలీదళ్ విమర్శలు

2లో



## ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ.. ఉలిక్కిపడిన పాకిస్థాన్!

- 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ డాక్యుమెంటరీతో కలకలం
- భారత్ వాదనలను తప్పుబడుతూ పాక్ సైన్యం అధికారిక ప్రకటన
- ఉగ్రసంస్థలకు భారీ నష్టం జరగడం

2లో

## వందేమాతరం అంటే నాటి బ్రిటీష్ పాలకులకు, నేటి కాంగ్రెస్‌కే భయం

- వందేమాతరం విషయంలో కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు
- స్వాతంత్ర్య దినోత్సవాల్లో వందేమాతరం గీతాలాపనను అడ్డుకోవడం దురదృష్టకరం
- నాటి బ్రిటీష్ పాలకులకు, నేటి కాంగ్రెస్ నేతలకు ఈ విషయంలో తేడా కనిపించడం లేదని వ్యాఖ్య
- దేశంలో కేవలం కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఆరోపణ
- ఆ పార్టీలకు సరైన బుద్ధి చెప్పాలన్న బండి సంజయ్





## పీఎం కేర్స్ ఫండ్‌కు రికార్డు స్థాయి నిధులు.. రూ.8,452 కోట్లకు చేరిన కార్పస్!

- ఇప్పటివరకూ ఇదే అత్యధిక కార్పస్
- పొదుపు ఖాతాల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లకు నిధుల మళ్లింపు
- పెట్టుబడుల వ్యూహం మార్పుతో పెరిగిన రాబడి
- కొవిడ్ బాధితుల పిల్లల కోసం కొనసాగుతున్న ఖర్చులు

పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా,

- మిగతా 2వ పేజీలో

పంచాయతీ నుంచి పార్లమెంట్‌దాకా

# బీసీలకు వెన్నుదన్ను..

- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ
- అసెంబ్లీ వేదికగా చారిత్రక నిర్ణయం ప్రకటించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 28 జిల్లా పరిషత్‌ల ఏర్పాటు, మేయర్లు, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు
- బీసీ రిజర్వేషన్లు తగ్గించి గత ప్రభుత్వం ద్రోహం చేసిందన్న ముఖ్యమంత్రి
- పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు అండగా ఉంటామని స్పష్టీకరణ



"పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని సీఎం ప్రకటించగానే సభ "జయహో బీసీ" నినాదాలతో దద్దరిల్లింది. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించుకుందని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం

- మిగతా 2వ పేజీలో

## బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

- బీసీ రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ
- మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహణ
- గత ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని చంద్రబాబు విమర్శ
- రాష్ట్రంలో జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 13 నుంచి 28కి పెంచాలని నిర్ణయం

బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణపై ఎవరైనా కోర్టుకు వెళ్లి కేసులు వేస్తే, వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజానీకం, చరిత్ర క్షమించవని ఆయన స్పష్టం చేశారు.

- మిగతా 2వ పేజీలో



## ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

- ఓటర్ల జాబితా నుంచి భారీగా ఓట్లు తొలగించారని ఆరోపణ
- సుమారు 73 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్
- బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శ
- ఈసీని కేంద్రం పాకెట్ సంస్థగా మార్చిందంటూ వ్యాఖ్య

తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

- మిగతా 2వ పేజీలో

## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ

2లో





2లో

## పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం

- నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి దేశంలో 2వ స్థానం
- కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం
- సీఎం చంద్రబాబు నాయకత్వమే కారణమన్న మంత్రి లోకేశ్
- స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే విజయానికి మూలమని వెల్లడి
- ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య

నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు.

# పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా బీసీలకు వెన్నుదన్ను..

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లను బీసీలకు వర్తింపజేయనున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం స్ఫూర్తితో, నిబంధనలకు లోబడే ఈ పెంపును అమలు చేస్తున్నామని వివరించారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని ఆయన సభకు గుర్తుచేశారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని చంద్రబాబు పునరుద్ఘాటించారు. 1984లో ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'యాక్ట్ ఆఫ్ 5' కింద దాన్ని 34 శాతానికి పెంచామని తెలిపారు. తమ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేయడం వల్లే ఎర్రన్నాయుడు, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, దేవేందర్ గౌడ్, అయ్యన్నపాత్రుడు వంటి లెజెండరీ నాయకులు బీసీ వర్గాల నుంచి ఎదిగారని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రోత్సాహం అందిస్తే ఎంపీటీసీ స్థాయి నేత కూడా ఎంపీగా ఎదగొచ్చని, కర్నూలు జిల్లాకు చెందిన బస్తిపాటి నాగరాజును ఎంపీగా గెలిపించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలను కూడా సీఎం ప్రకటించారు. సుస్థిర పాలన కోసం పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికను మళ్లీ ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రస్తుతం 13గా ఉన్న జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 28కి పెంచుతున్నట్లు తెలిపారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు పొందాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యవసరమని స్పష్టం చేశారు. ంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు, గ్రామీణ వృత్తులకు బీసీలే వెన్నెముక అని సీఎం కొనియాడారు. వారి నైపుణ్యానికి సాంకేతికతను జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్య అందిస్తామని, విద్య, ఉపాధి, నైపుణ్యం ద్వారా వారిని ఉన్నత స్థానంలో నిలబెడతామని హామీ ఇచ్చారు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, అవకాశం రాక వెనుకబడినవారని, వారికి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ చారిత్రక ప్రకటన అనంతరం బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

# వందేమాతరం అంటే నాటి బ్రిటీష్ పాలకులకు, నేటి కాంగ్రెస్‌కే భయం

వందేమాతరం గీతం విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేమాతరం అనగానే ఒకప్పుడు బ్రిటీష్ పాలకులకు ఏ విధమైన భయం కలిగేదో, నేడు కాంగ్రెస్ పార్టీకి సైతం అదే భయం పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ విషయంలో నాటి బ్రిటిష్ పాలకులకు, నేటి కాంగ్రెస్ నాయకులకు మధ్య పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేల వైఖరి చూసి దేశ ప్రజలంతా విస్మయం చెందుతున్నారని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వందేమాతరం గీతాలాపనను నిరోధించడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. దేశంలో కేవలం కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో దేశ ప్రజల్లో స్ఫూర్తిని రగిల్చిన ఈ గీతం పట్ల కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరికాదని బండి సంజయ్ హితవు పలికారు.

# పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం

ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

# బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ ప్రభుత్వ లక్ష్యాలను సవివరంగా ప్రకటించారు. బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం రాష్ట్ర మంత్రివర్గం మూడు కీలక నిర్ణయాలు తీసుకుందని చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు, పట్టణాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించామని, ఇది 'ఆయారాం గయారాం' రాజకీయాలకు తెరదించి, సుస్థిరమైన పాలనకు దోహదపడుతుందని వివరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 28 జిల్లాలకు అనుగుణంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.



### ఎన్టీఆర్ స్ఫూర్తితో బీసీలకు న్యాయం

బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం పార్టీకి ముందు, ఆ తర్వాత అని స్పష్టంగా చూడవచ్చని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతే బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. 1984లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తాను 1995లో ముఖ్యమంత్రిగా యాక్ట్ ఆఫ్ 5 కింద బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించానని, 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో ఇదే కోటాను అమలు చేశామని తెలిపారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, దేవేందర్ గౌడ్ వంటి ఎందరో బీసీ నేతలు టీడీపీ ద్వారానే బలమైన నాయకులుగా ఎదిగారని ఉదహరించారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అదే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

### గత ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టిన సీఎం

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. 2019లో జీవో 176 తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకుండా బీసీల హక్కులను కాలరాశారని విమర్శించారు. జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24.15 శాతానికి తగ్గించి, తద్వారా సుమారు 16,800 బీసీ నాయకత్వ స్థానాలు కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "బీసీలకు ద్రోహం చేయటంలో వాళ్లు నెంబర్ వన్" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం బీసీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం, తోట చంద్రయ్య గొంతు కోయడం, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య హత్యల వంటి దారుణాలను ప్రస్తావిస్తూ.. వారు సిద్ధాంతాల కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని దుయ్యబట్టారు.

### బీసీల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక

తమ ప్రభుత్వం బీసీలకు కేవలం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా, వారి సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. "బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు" అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో 50.54 శాతంగా ఉన్న బీసీల విద్య, నైపుణ్యం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, వారి అద్భుతమైన నైపుణ్యాలకు టెక్నాలజీని జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తేనే 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు వస్తాయని వివరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికి వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ చారిత్రక నిర్ణయానికి సభ ఆమోదం తెలపాలని కోరుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

# పీఎం కేర్స్ ఫండ్‌కు రికార్డు స్థాయి నిధులు.. రూ.8,452 కోట్లకు చేరిన కార్పస్!

కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ. 5.77 కోట్లు మాత్రమే సమకూరింది. వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ. 479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ. 92.83 లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ. 324.66 కోట్ల రిఫండ్‌లు కూడా ఈ ఖాతాలో చేరాయి. కొవిడ్-19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ఈ ఫండ్ ద్వారా కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు చేయూతనిచ్చే 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్' పథకం కింద వ్యయం చేస్తున్నారు.

# పంజాబ్‌లో 'ఫేక్' లబ్ధిదారుల భాంగ్రా నృత్యం... వివాదంలో ఆప్ సర్కార్

పంజాబ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సందర్భంగా చోటుచేసుకున్న ఒక ఘటన తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ ఆరోగ్య పథకం ద్వారా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న లబ్ధిదారులుగా పరిచయం చేసిన కొందరు వృద్ధులు భాంగ్రా నృత్యం చేశారు. అయితే, వారు అసలైన లబ్ధిదారులు కాదని, ఆరోగ్య శాఖకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులని వెల్లడి కావడంతో ప్రతిపక్షాలు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించాయి. ఫిరోజ్‌పూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో భాగంగా ఆరోగ్య శాఖ శకటం ప్రదర్శన సమయంలో ఐదుగురు వ్యక్తులు ఉత్సాహంగా భాంగ్రా నృత్యం చేశారు. 'ముఖ్యమంత్రి సేహత్ యోజన' కింద వీరు విజయవంతంగా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్నారని వేదికపై నుంచి ప్రకటించారు. కానీ, ఆ తర్వాత అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నృత్యం చేసిన ఐదుగురు వ్యక్తులు ఆరోగ్య శాఖలో డ్రైవర్లు, వర్కర్లుగా పనిచేసి పదవీ విరమణ పొందినవారని తెలిసింది. వారిలో ఒకరు మీడియాతో మాట్లాడుతూ, "మాకు నృత్యం చేయమని చెప్పారు. నాకు మోకాలి ఆపరేషన్ జరగలేదు. మిగతా వారి గురించి నాకు తెలియదు" అని స్పష్టం చేశారు. ఈ వివాదంపై ఫిరోజ్‌పూర్ సివిల్ సర్జన్ డాక్టర్ మీనాక్షి ధింగ్రా స్పందిస్తూ, ఇది కేవలం పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన సంకేతాత్మక (సింబాలిక్) ప్రదర్శన మాత్రమేనని వివరణ ఇచ్చారు.

# ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ.. ఉలిక్కిపడిన పాకిస్థాన్!

భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ ఛానెల్ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆగస్టు 15న ప్రసారమైన "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" అనే ఈ డాక్యుమెంటరీతో ఉలిక్కిపడిన పాకిస్థాన్, ఈ డాక్యుమెంటరీపై, భారత్‌పై ఎదురుదాడికి దిగింది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు అత్యంత రహస్యంగా నిర్వహించిన ఈ ఆపరేషన్ వివరాలను ఈ డాక్యుమెంటరీ కళ్లకు కట్టింది. పాకిస్థాన్ సైన్యానికి చెందిన మీడియా విభాగం 'ఇంటర్-సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్' (ఐఎస్‌పీఆర్) ఈ డాక్యుమెంటరీపై స్పందిస్తూ, ఇది భారత్ సృష్టించిన కల్పిత కథనమని ఆరోపించింది. ఈ ఆపరేషన్ వంద శాతం విజయవంతమైందన్న భారత వాదనలను అది తోసిపుచ్చింది. అయితే, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోయిందని, ఆ పరాభవాన్ని కప్పిపుచ్చుకోవడానికే పాక్ ఉన్నతాధికారులు ఇటువంటి దూకుడు ప్రదర్శిస్తున్నారని భారత అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆపరేషన్ ధాటికి లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలు తమ శిక్షణా కేంద్రాలు, ప్రధాన కార్యాలయాలతో పాటు కీలక మౌలిక వసతులను, కేడర్‌ను భారీగా కోల్పోయాయి. తాజాగా విడుదలైన ఈ డాక్యుమెంటరీ పాకిస్థాన్ పాత గాయాలపై కారం చల్లినట్లయిందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో, డాక్యుమెంటరీ ప్రామాణికతను ప్రశ్నిస్తూ సోషల్ మీడియా వేదికగా నిరంతర ప్రచార దాడులు నిర్వహించాలని ఐఎస్‌పీఆర్‌కు ఆదేశాలు అందినట్లు భారత నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పటి నుంచి భారత్‌పై పాకిస్థాన్ ఒక 'సమాచార యుద్ధాన్ని కొనసాగిస్తోందని, అందులో భాగంగానే సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తప్పుడు కథనాలు, మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేసే ప్రమాదముందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.



# ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది

నగరంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదని, ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ వల్ల పేదలు, వలస కార్మికులే ఎక్కువగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదని, పాత రికార్డులను సాకుగా చూపుతూ పౌరుల ఓటు హక్కును నిరాకరించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎలాంటి పక్కా కారణాలు లేకుండా సుమారు 73 లక్షల ఓట్లను తొలగించారని, మరో 92 లక్షల ఓట్లను అనుమానిత జాబితాలో చేర్చారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'పాకెట్ సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.





# మానవతా సేవతో 'సిరి మహాలక్ష్మి ఇన్‌ఫ్రా' వార్షికోత్సవం

- అనాథ పిల్లలకు ఆహారం, దుస్తుల పంపిణీ
- నాలుగో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సంస్థ



**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** సిరి మహాలక్ష్మి ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ మూడేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని నాలుగో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 3వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించింది. ఎల్‌బీనగర్‌లో జరిగిన ఈ వేడుకల్లో సంస్థ ఉద్యోగులు, అసోసియేట్స్, వినియోగదారులు, భూ యజమానులు, శ్రేయోభిలాషులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేడుకలను కేవలం వ్యాపార కార్యక్రమానికే పరిమితం చేయకుండా మానవతా దృక్పథంతో అనాథ పిల్లలకు ఆహారం, దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. అనంతరం సంస్థ యాజమాన్యం మాట్లాడుతూ.. మూడేళ్లుగా తమపై విశ్వాసం ఉంచి అండగా నిలిచిన వినియోగదారులు, ఉద్యోగులు, భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి నమ్మకం, సహకారమే సంస్థ విజయానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. వ్యాపార విజయంతో పాటు సామాజిక బాధ్యతగా మున్ముందు కూడా పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. అదే సమయంలో నాణ్యమైన ప్రాజెక్టులు, మెరుగైన సేవలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ కె.వి. రెడ్డి, సీఈఓ సుధాకర్ రెడ్డి, అడ్మిన్ హనీమీ రెడ్డి, మహిళలు, సంస్థ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి

- సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్



**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** గ్రామ పంచాయతీ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా, ఐక్యంగా ఉద్యమించాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం వనస్థలిపురంలోని ఒక ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో సర్పంచులు ప్రజల్లో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఉపసర్పంచులకు ఇచ్చిన చెక్ పవర్‌ను తక్షణమే రద్దు చేయాలని, సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలని, పంచాయతీ విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. కరువు సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, గ్రామాభివృద్ధి నిధుల వినియోగానికి సర్పంచులకు ప్రత్యేక అకౌంట్ వెసులుబాటు కల్పించాలన్నారు. మహిళా సర్పంచులపై దాడులు జరగడం విచారకరమని, ఈ అంశాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జక్క రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు భీమిడి ప్రదీప్, పెంటాగౌడ్, నర్సింహులు, జనరల్ సెక్రెటరీ కరణం కీర్తి రామకృష్ణ, మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చేవెళ్ల రేఖ తదితరులు పాల్గొన్నారు.

# బీఫార్మసీలో 'పల్లెపాటి సౌందర్య'కు ప్రథమ ర్యాంకు

- జేఎన్టీయూలో మొదటి స్థానంలో నిలిచిన రాజపేట విద్యార్థిని
- ఎంఫార్మసీ చేయడమే లక్ష్యమన్న విద్యా కుసుమం



**తొలివెలుగు, రాజపేట :** బీఫార్మసీ విభాగంలో రాజపేటకు చెందిన పల్లెపాటి సౌందర్య జేఎన్టీయూ విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి ప్రతిభ చాటింది. రాజపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న పల్లెపాటి నరసింహులు – రోజా దంపతుల కుమార్తె సౌందర్య. సౌందర్య తన ప్రాథమిక విద్యను రాజపేటలోని శ్రీ రామకృష్ణ విద్యా మందిర్‌లో, ఉన్నత విద్యను మాంటిసోరి హైస్కూల్‌లో, ఇంటర్మీడియట్‌ను బండ్లగూడలో పూర్తి చేసింది. అనంతరం జేఎన్టీయూ కేవీకేసీపీలో బీఫార్మసీ అభ్యసించి విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రథమ ర్యాంక్ కైవసం చేసుకుంది. జేఎన్టీయూలో దశాబ్ద కాలం తర్వాత ఈ స్థాయి అరుదైన గౌరవం దక్కడం గమనార్హం. చిన్ననాటి నుంచి చదువులో ప్రతిభ కనబరుస్తున్న సౌందర్య.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధించినట్లు తెలిపింది. భవిష్యత్తులో ఎంఫార్మసీ పూర్తి చేసి ఉన్నత లక్ష్యాలను చేరుకుంటానని ధీమా వ్యక్తం చేసింది.

# గద్దర్ జీవితం భావితరాలకు ఆదర్శం

- 'ప్రజా యుద్ధనౌక గద్దర్' డాక్యుమెంటరీ పోస్టర్ ఆవిష్కరణ
- ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** అట్టడుగు వర్గాల హక్కుల సాధన కోసం ఐదు దశాబ్దాలుగా తన గళంతో నిరంతరం పోరాడిన వ్యక్తి ప్రజా యుద్ధనౌక గద్దర్ అని రాష్ట్ర రోడ్డు రవాణా, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొనియాడారు. భూదాన్ పోచంపల్లికి చెందిన గద్దర్ అవార్డు గ్రహీత, దర్శకుడు బడుగు విజయ్, తమసోమా జ్యోతిర్గమయ చిత్ర నిర్మాత తడక రమేష్ సంయుక్త నిర్మాణంలో 'విమల్ క్రియేషన్స్' పతాకంపై రూపొందిస్తున్న 'ప్రజా యుద్ధనౌక గద్దర్' డాక్యుమెంటరీ చిత్ర పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాహితీ సంస్థ చైర్మన్, గద్దర్ కుమార్తె వెన్నెలతో కలిసి మంత్రి ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా హక్కుల సాధనే ధ్యేయంగా జీవితాన్ని అంకితం చేసిన గద్దర్ చూపిన పోరాట బాట, సాధించిన విజయాలు భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ చేరేలా ఘనంగా నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్ర సహ నిర్మాత గుంటి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాల్లో కోత వేగమే.. బకాయిల చెల్లింపులో ఆలస్యమా?





- ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలి
- 'తపస్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య డిమాండ్

**తొలివెలుగు, రాజపేట :** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం మౌనం వీడాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య డిమాండ్ చేశారు. రాజపేట మండలంలో మంగళవారం నిర్వహించిన తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఉద్యోగుల జీతాల నుంచి కోతలు విధించడంలో చూపే వేగం, వారికి రావాల్సిన బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం చూపించడం లేదని మండిపడ్డారు. ప్రస్తుతం ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్‌సీపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టతా ఇవ్వడం లేదని విమర్శించారు. హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేయడం లేదని, పూర్తిస్థాయిలో ఆరోగ్య పథకం ఎప్పటి నుంచి అమలవుతుందో స్పష్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యకష్యురాలు రేపాక ఉమ, మండల అధ్యక్షుడు దుడుకు జానయ్య, ప్రధాన కార్యదర్శి పున్న సత్యానంద్, జిల్లా నాయకులు పలుగుల రాజు, శ్రీహరి నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

- రాజాపేటలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు
- హోరెత్తిన భారీ బైక్ ర్యాలీ, సామూహిక భోజనాలు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట మండల కేంద్రంలో కల్లు గీత కార్మిక సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పురవీధుల గుండా ఉత్సాహపూరిత వాతావరణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్ గౌడ్, గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు బోలగాని జయరాములు, పిఎసిఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగా నరేష్, గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తిని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన పెద్దలను శాలువాలతో సత్కరించిన అనంతరం సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు.



# పాపన్న పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గౌడ సంఘం నాయకులు
- పోచంపల్లి, దేశ్‌ముఖి గ్రామాల్లో వేడుకలు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి పురపాలక పరిధితో పాటు మండలవ్యాప్తంగా సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోచంపల్లి కేంద్రంలో గౌడ సంఘం అధ్యక్షుడు గునిగంటి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం సర్వాయి పాపన్న సాగించిన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కొయ్యడ యాదయ్య గౌడ్, చెరుకు బిక్షపతి గౌడ్, చెరుకు అంజయ్య గౌడ్, బండి యాదగిరి గౌడ్, ఉపాధ్యక్షుడు తండా వెంకటేశం, ప్రధాన కార్యదర్శి మక్తల్ పోషయ్య, నాయకులు సార బాలయ్య, తంతరపల్లి వెంకటేశం, ముప్పిడి శ్రీనివాస్, చెరుకు మల్లయ్య, కట్కూరి పాండు, వేముల సుమన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే దేశ్‌ముఖి గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షుడు సూర బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర బలరాం, దూసరి రాములు, బైరు ధనుంజయ, రాగుల స్వామి, దూసరి కృష్ణ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరులో డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన వ్యక్తికి ఒక రోజు జైలు,10 వేల జరిమానా...!

కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించింది. కందుకూరు ఞ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పోలీసులు కూకట్‌పల్లికి చెందిన రాజ్‌బీర్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో 311% దీూజ నమోదు కావడంతో అతనిపై కేసు నమోదు చేశారు.అనంతరం నిందితుడిని ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరుపరచగా, గౌరవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ వి.సుజాత మోటార్ వెహికల్స్ యాక్ట్ సెక్షన్ 185(ఋ) ప్రకారం ఒక రోజు జైలు శిక్షతో పాటు ?10,000 జరిమానా విధించారు.ఈ సందర్భంగా కందుకూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎచ్ .వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల తనతో పాటు ఇతర వాహనదారుల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు.



## నూతన ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డికి ఘన సన్మానం

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్ రెడ్డిని రెడ్లరేపాక గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేశబోయిన బాలస్వామి యాదవ్, మాజీ సర్పంచ్ మాద లావణ్య శంకర్ గౌడ్, ఉపసర్పంచ్ కోమల కుమార్, మొహమ్మద్ జానీ, కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జువ్వగాని సుమన్ గౌడ్, పంతంగి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఆరూరులో వైభవంగా సర్వాయి పాపన్న జయంతి
- ఆకట్టుకున్న చిన్నారి పాపన్న వేషధారణ, కేక్ కటింగ్



**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో గౌడ సంఘం అధ్యక్షుడు కళ్లెం బాలశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక అయిన పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న వేషధారణలో అలరించిన బత్తిని ఓం సాయి కీర్తన అనే చిన్నారితో కేక్ కట్ చేయించారు. అనంతరం బాలశంకర్ గౌడ్ మాట్లాడుతూ.. పాపన్న సాగించిన సామాజిక పోరాటాలు, గెరిల్లా యుద్ధ తంత్రాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. సమసమాజ స్థాపనకు ఆయన అందించిన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెమ్మయ్య, మాజీ ఎంపీటీసీ పోలెపాక చంద్రయ్య, నాయకులు కొప్పుల దాసు, లోతుకుంట బాలరాజ్, ఎర్ర వెంకయ్య, బత్తిని నరసింహ, బత్తిని కరుణాకర్, ఎర్ర మచ్చగిరి, బత్తిని గోపి, మారగోని శ్రీనివాస్, గౌడ సంఘ ప్రతినిధులు, గ్రామ యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా పోతగల్ల శ్రీనివాస్

- సంస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం పనిచేస్తున్న ఎమ్మార్పీఎస్ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని ఆ సంఘం యాదాద్రి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ కోరారు. భూదాన్ పోచంపల్లి మున్సిపల్ కేంద్రంలోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ పట్టణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నూతన పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా పోతగల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కుక్క బిక్షపతి, పెద్దల శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శిగా పోతగల్ల నరసింహ, సహాయ కార్యదర్శిగా నల్ల నరసింహ నియామకమయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఇటుకల దేవేందర్, 4వ వార్డు కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, సీనియర్ నాయకులు కరగల్ల కుమార్, కొమ్ము లక్ష్మణ్, చెరుకు వెంకటేష్, కుక్క దానయ్య, పెద్దల శ్రీనివాస్, కుక్క కుమార్, లింగస్వామి, రవి, రాకేష్, చెరుకు నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరులో సంచార పశువైద్య అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ...!

**తొలివెలుగు,మహేశ్వరం :** హేశ్వరం నియోజకవర్గం కందుకూరులో సంచార పశు వైద్యశాల అంబులెన్స్ సేవలను అంబులెన్స్ నిర్మాణాధికారి శ్రీ హరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ంగళవారం కందుకూరు మండల కేంద్రంలోని సంచార పశు వైద్యశాల అంబులెన్స్‌ను పరిశీలించిన ఆయన, అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలు, మందులు, రికార్డులు మరియు సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర సమయంలో పశువులకు చికిత్స అవసరమైనప్పుడు, పశువులను ఆస్పత్రికి తీసుకెళ్లే పరిస్థితి లేనప్పుడు రైతులు 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే అంబులెన్స్ సిబ్బంది స్పందించే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ హరి మాట్లాడుతూ.. పశువులకు అనారోగ్యం వచ్చినప్పుడు సిబ్బంది వెంటనే స్పందించి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో అంబులెన్స్ సిబ్బంది సాయికిరణ్, యాదయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

# రోడ్డు గుంతలను పూడ్చాలని బీజేపీ ధర్నా



- ప్రయాణికులకు తప్పని ప్రమాదాలు.. మరమ్మతులు చేపట్టకపోతే ముట్టడి తప్పదని హెచ్చరిక

**తొలివెలుగు, వలిగొండ :** ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వలిగొండ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ నాయకత్వంలో చేపట్టిన ఈ నిరసనలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గుంతలతో ప్రయాణికులకు ఇబ్బందులు:**

వలిగొండ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో నిత్యం ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి నెలకొందని తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**ముట్టడిస్తాం.. ఆందోళన ఉధృతం చేస్తాం:**

రోడ్డు మరమ్మతులపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత శాఖల కార్యాలయాలతో పాటు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తే ఎమ్మెల్యేను అడుగడుగునా నిలదీస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, రాస వెంకట్, బచ్చు శ్రీనివాస్, పాక పుల్లయ్య, బొడిగే ఆనంద్, కందుల తానేష, మంద నరసింహ, రావుల పద్మారెడ్డి, మండల పదాధికారులు మందుల నాగరాజు, రంజిత్‌రెడ్డి, దయాకర్, వెంకటేష్, శ్రీనివాస్, మహేష్, ఎర్రవోలు జంగయ్య, అరుణ్‌తో పాటు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగు మేలు

- కరువును తట్టుకునే స్వల్పకాలిక రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలి
- పల్లెర్లలో రైతులకు ఏఈఓ అశోక్ కుమార్ అవగాహన



**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం):** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ముందస్తుగా అత్యవసర సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ఎం. అశోక్ కుమార్ సూచించారు. మండలంలోని పల్లెర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తక్కువ నీటితో పండే కంది, అలసంద, పెసర, ఉలవలు తదితర ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని కోరారు. అందుబాటులో ఉన్న నేల తేమకు అనుగుణంగా విత్తన ఎంపిక, విత్తే సమయం, సరైన మొక్కల సాంద్రతను పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ఎరువుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్' (ఎఫ్ఎఫ్ఎస్) యాప్‌పై ఈ సందర్భంగా రైతులకు ప్రాథమిక అవగాహన కల్పించారు. దీని ద్వారానే ఎరువులు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే, ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోని 315 మంది రైతుల జాబితాను గ్రామ పంచాయతీలో ప్రదర్శించామని, సంబంధిత రైతులు వెంటనే నమోదు పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు మంజుల, నవనీత, రైతులు కృష్ణ, అంజయ్య, నాగేశ్వర్ రెడ్డి, సంధ్య, మంజుల తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ముంగిటకు యూరియా సబ్ సెంటర్





- పాముకుంటలో ఘనంగా ప్రారంభోత్సవం
- హాజరైన సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్

**తొలివెలుగు,రాజాపేట :** రాజాపేట మండలం పాముకుంట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూరియా సబ్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. రైతుల సౌకర్యార్థం ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ రంగ నరేష్ గౌడ్, మండల పీఏసీఎస్ చైర్మన్ నేమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూడిగే పెంటయ్య గౌడ్, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిల్వరు బాలరాజు గౌడ్, విట్టల్ నాయక్, డైరెక్టర్ చెక్కల బాలయ్య పాల్గొన్నారు. వీరితో పాటు ఉప సర్పంచ్ షరీఫ్, శేఖర్, బత్తిని పాండు, రంగ పాండు, కొలిపాక వెంకట్నార్సు, గుంటి అశోక్, బచ్చలి శేఖర్, ఎండీ మాగదుం తదితరులు, పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాపన్న జయంతి వేళ.. మత్తుపై ఉక్కుపాదం!

- అక్రమ మద్యం, మాదకద్రవ్యాల విక్రయాలపై కఠిన చర్యలు
- గ్రామంలోని దుకాణ యజమానులతో ప్రత్యేక సమావేశం: ఎస్ఐ నరసింహారెడ్డి

**తొలివెలుగు, చౌటుప్పల్:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు, మాదకద్రవ్యాలు, బెల్ట్‌షాపుల నిషేధంపై సమీక్ష సమావేశం అంకిరెడ్డిగూడెంలో మంగళవారం నిర్వహించారు. భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గీత కార్మిక గౌడ సంఘం వద్ద భీమగోని మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలోనూ జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన మాదకద్రవ్యాలు, బెల్ట్‌షాపుల నిషేధ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో చౌటుప్పల్ ఎస్ఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో బెల్ట్‌షాపులు నిర్వహించకుండా, అక్రమంగా మద్యం విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామంలోని అన్ని దుకాణాల యజమానులతో త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మద్యం, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా మద్యం, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయించినట్లు తేలితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. గ్రామంలో మత్తు పదార్థాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పోలీస్ సందీప్, కమిటీ సభ్యులు నల్ల జయప్రద, ముద్దం మంజుల, భీమగోని మల్లేశం గౌడ్, పెండెం లక్ష్మి, దొడ్ల సెట్టయ్య గౌడ్, బత్తుల జంగయ్య గౌడ్, పల్సం అంజయ్య గౌడ్, బొమ్మని సత్తయ్య గౌడ్, సుర్వి నరసింహ గౌడ్, అంతటి జంగయ్య గౌడ్, బొమ్మని బాలరాజ్ గౌడ్, సుర్వి దాస్ గౌడ్, గంగాపురం పాండు గౌడ్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# 'మత్తు'లో జీవితాలను చిత్తు చేసుకోవద్దు

- క్రీడలు, చదువుపై యువత దృష్టి సారించాలి
- అంకిరెడ్డిగూడెంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు

**తొలివెలుగు, చౌటుప్పల్:** క్షణికానందం కోసం మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని చౌటుప్పల్ ఎస్ఐ డి. నర్సిరెడ్డి యువతకు పిలుపునిచ్చారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అంకిరెడ్డిగూడెం గ్రామంలో సీఐ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్‌కు బానిసైతే వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం కూడా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. యువత చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలు, ఉద్యోగ సాధనపై దృష్టి సారించాలని హితవు పలికారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ స్పష్టం చేశారు. మత్తు పదార్థాల నిర్మూలనకు యువత, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

- ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: కొయ్యడ శేఖర్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి చౌరస్తా వద్ద మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాపన్న చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం నేటి యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, ఆలే శ్రీలత చిరంజీవి, గడ్డం ఇందిరా రాజరత్నం, పలువురు గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సీజ్డ్ వాహనాల విడుదలలో జాప్యం..!

## ఇబ్బంది పడుతున్న వాహనదారులు

వాహనాల సంఖ్య పెరిగిపోతుంది. అధికారులు టార్గెట్ ఛేదనలో భాగంగా నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ తనిఖీల్లో చాలా వాహనాలు పరిమితికి మించి బరువు, పన్ను ఎగవేత, ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, తదితర నిబంధనల ఉల్లంఘన వంటి ఆరోపణలతో సీజ్ అవుతున్నాయి. అయితే ఈ వాహనాలను మళ్లీ విడుదల చేసుకోవడంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనానికి సంబంధించిన చిరునామా ఆధారంగా ఆర్టీఓ కార్యాలయంలో సంబంధిత వాహన ట్యాక్స్ లు క్లియర్ చేసుకోవాల్సి ఉంటుంది. సదరు అధికారి రాసిన చెక్ రిపోర్ట్ ఆధారంగా జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. వాహనాల పత్రాలు అన్నీ సరిచూసుకొని అధికారులు వాహన విడుదలకు అనుమతినివ్వాలి. ఆ అనుమతి పత్రాన్ని ఏ ఆర్టీఓ కార్యాలయ పరిధిలో వాహనం సీజ్ అయిందో అక్కడికి వెళ్లి అందించాలి. అప్పుడు సదరు అధికారులు ఆ వాహనాన్ని విడుదల చేస్తారు. కానీ ఈ ప్రక్రియ నగరంలోని పలు కార్యాలయాల్లో నత్తనడకన సాగుతోంది. వాహనానికి సంబంధించిన జరిమానాలు చెల్లించాక కూడా సదరు వాహనం విడుదలలో తీవ్ర జాప్యం ఏర్పడుతుంది. నెల, రెండు మిగతా నెలల పరిమితి పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ వాహనంపైనే వ్యాపారం ఆధారపడి ఉం డటంతో ఆర్థికంగానూ నష్టపోతున్నామని చెబుతున్నారు. గతంలో ఇలాంటి వ్యవహారంపై పోలీసులు లేదా ఆర్టీఓ అధికారులు సీజ్ చేసిన వాహనాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతున్నదనే ప్రధాన అంశంతో దాఖలైన 50కి పైగా కేసులను అప్పటి జస్టిస్ నవీన్ రావు నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ప్రత్యేక ఆదేశాలు సైతం జారీ చేసింది. పరిమితికి మించి బరువు, నిబంధనల ఉల్లంఘన వంటి ఆరోపణలతో సీజ్ చేసిన వాహనాల విడుదల విషయంలో ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సెక్రటరీ లేదా సంబంధిత అధికారులు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించిన విషయం తెలిసిందే. కాగా, గ్రేటర్ వ్యాప్తం గా ఆర్టీఓ కార్యాలయాల్లో సీజ్డ్ వాహనాలు వందల సంఖ్యలో పేరుకుపోతున్నాయి. కొన్ని వాహనాలను వాహనదారులు తీసుకోవడానికి ముందుకురావడం లేదు. అలాంటి కాలపరిమితి మించిన వాహనాలను అధికారులు నోటిఫికేషన్ ఇచ్చి వేలం వేస్తున్నారు. వేలంలో దక్కించుకున్నవారి పేరుమీద వాహనాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అయితే సీజ్డ్ వాహనాల విడుదల ప్రక్రియను సులభంగా చేస్తే వాహనదారులకు ఇబ్బందులు తప్పనున్నాయి. ఆ మేరకు సాంకేతిక సేవల్లో మార్పులు తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.

# బహుజనుల ఐక్యతతోనే రాజ్యాధికారం

- సర్వాయి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి
- రాజాపేటలో ఘనంగా పాపన్న విగ్రహావిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బూర నర్సయ్య గౌడ్, అశోక్ గౌడ్

**తొలివెలుగు, రాజాపేట :** సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భాజపా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం రాజాపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన పాపన్న విగ్రహాన్ని వారు ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో బహుజనులు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోగలరని, కుల, వర్గ, ప్రాంత భేదాలకు అతీతంగా ఏకం కావాలని కోరారు. బహుజన రాజ్యాధికారం సాధించాలంటే ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సుదగాని హరిశంకర్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమం సందర్భంగా ప్రధాన వీధుల గుండా భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.



అనంతరం సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. గీతన్నల చైతన్య యాత్ర సభ్యులతో పాటు నాయకులు గోదా శ్రీరాములు గౌడ్, సర్పంచ్ కోయ మధు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగ నరేష్, పాండవుల లక్ష్మణ్ గౌడ్, సిల్వర్ బాలరాజ్ గౌడ్, మహేందర్ గౌడ్, బుడిగే పెంటయ్య గౌడ్, పల్లె సంతోష్ గౌడ్, బాలమణి యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ సాధన కోసం పోరాడాలి



- సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణే లక్ష్యం
- పీఆర్‌టీయూ రాజపేట మండల నూతన అధ్యక్షుడిగా గౌటె బాలరాజు

**తొలివెలుగు, రాజపేట:** పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు సమన్వయంతో ముందుకు సాగాలని పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం రాజపేట మండల కేంద్రంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల శాఖ సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షుడు సంపతి సుబ్బరాజు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రధాన కార్యదర్శి గౌటె బాలరాజు నివేదికను సమర్పించారు. సంఘం ప్రాముఖ్యత, ఉపాధ్యాయులు సాధించాల్సిన లక్ష్యాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడంతో పాటు 5,500 పీఎస్ హెచ్ఎం పోస్టుల మంజూరు, ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకు కృషి చేయాలని తీర్మానించారు.

**నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక:**

అనంతరం పీఆర్‌టీయూ టీఎస్ రాజపేట మండల శాఖ 2026-2028 నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌటె బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా సంపతి సుబ్బరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా వై. ప్రభాకర్ రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా వి. భారతి, ఉపాధ్యక్షులుగా ఎం.డి. గౌస్ పాషా, రవీందర్, మహిళా ఉపాధ్యక్షులుగా కె. అరుణ కుమారి, వై. సరిత, కార్యదర్శులుగా పి. కనకయ్య, బి. బాలరాజు, మహిళా కార్యదర్శులుగా ఇ. శిరీష, కె. రాజరాజేశ్వరి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు గడ్డమీద పాండురంగం వ్యవహరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుంట్ల అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గదసంతల మధుసూదన్, గౌరవ అధ్యక్షుడు కంచర్ల వీరారెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి, రాష్ట్ర అకాడమిక్ చైర్మన్ జాలిగామ రామ్‌మోహన్, రాష్ట్ర నాయకులు నిరంజన్ రెడ్డి, వలిగొండ మండల అధ్యక్షుడు విజయానంద్, కాంప్లెక్స్ హెచ్ఎం తడ్క రాజు, మాజీ రాష్ట్ర నాయకుడు బూర్గు మహేందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బత్తిని పరమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్ కన్నా, వంశీధర్, శివరాజ్, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిని బతికించండి.. హైకోర్టు

# ప్రధాన న్యాయమూర్తికి 20 వేల కార్డులు

విద్యా వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల మధ్య భారీ వ్యత్యాసం ఉందన్నారు. రాష్ట్రంలో 63 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ సెక్టార్ లో చదువుతుండగా, కేవలం 37 శాతం మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కస్తూర్బా పాఠశాలల్లో 4 నుంచి 5 లక్షల మంది విద్యార్థులకు హాస్టల్ వసతులతో కూడిన విద్య అందుతోందని, అయితే హాస్టల్ సదుపాయం లేని డే స్కూళ్లలో సుమారు 10 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వెల్లడించారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో తగినన్ని తరగతి గదులు, బెంచీలు, తాగునీరు మౌలిక వసతులు అందుబాటులో లేవన్నారు. ఉపాధ్యాయుల కొరత కూడా విద్యాబోధనపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. విద్యార్థినులకు పాఠశాలల్లో మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడం తీవ్ర సమస్యగా మారిందన్నారు. టాయిలెట్లు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది బాలికలు రోజంతా నీళ్లు తాగకుండా ఉంటున్నారన్నారు. దీంతో విద్యార్థినులు తీవ్రమైన యూరినరి ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లకు గురై అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. 'అసర్' నివేదిక ప్రకారం 8వ తరగతి చదువుతున్న విద్యార్థి 4వ తరగతి స్థాయి లెకలు చేయలేకపోతున్నాడని, 9వ తరగతి విద్యార్థి 5వ తరగతి తెలుగు పుస్తకాన్ని చదవలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు ప్రాథమిక, సెకండరీ, ఇంటర్, ఉన్నత, సాంకేతిక విద్యలతో కలిపి విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్ లో కేవలం 8 శాతం మాత్రమే కేటాయిస్తున్నారని తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులను కనీసం 15 శాతానికి పెంచాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్ లు, లైబ్రరీలు, క్రీడా ప్రాంగణాలు కల్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలన్నారు. ప్రభుత్వ బడుల్లోని దయనీయ పరిస్థితులను నేరుగా న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లడమే ఈ పోస్ట్‌కార్డ్ ఉద్యమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. విద్యార్థులతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాయించి పంపిస్తున్నామని, మొత్తం 20 వేల లేఖలను పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే విద్యార్థుల నుంచి 12 వేలకుపైగా లేఖలు హైకోర్టుకు చేరుకున్నాయని చెప్పారు. హైకోర్టు ఈ లేఖలపై సుమోటోగా స్పందించకపోతే, విద్యార్థులు పంపిన లేఖలను ఆధారంగా చేసుకుని తామే స్వయంగా ప్రత్యేక పిటిషన్ దాఖలు చేసి న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. డయల్ యువర్ విలేజ్ ప్రతినిధి రవిప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదురొంటున్న సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో, వారి సమస్యలను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ పోస్ట్ కార్డు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలను మెరుగుపర్చకుండా 27వేల పాఠశాలలను 4వేలకు కుదిస్తామని చెప్పడం సరికాదన్నారు. సమావేశంలో న్యాయవాది సుమంత్, ఫొటో జర్నలిస్టు, రచయిత కందుకూరి రమేశ్, డయల్ యువర్ విలేజ్ప రతినిధి మహిపాల్, సురేశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# పదవి కాదు.. బాధ్యత

- రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా భీమిడి ప్రదీప్ జీ
- ఏకగ్రీవంగా ఎన్నికైన స్వాములవారి లింగోటం సర్పంచ్
- గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా
- ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, గ్రామస్తులకు కృతజ్ఞతలు

**తొలివెలుగు, చౌటుప్పల్/ఎల్బీనగర్:** తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తన జీవితంలో మరుపురాని ఘట్టమని చౌటుప్పల్ మండలం స్వాములవారి లింగోటం గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి సర్పంచ్‌గా గెలిపించిన గ్రామ ప్రజల ఆశీర్వాదం, సహకారం వల్లే రాష్ట్ర స్థాయిలో ఈ గుర్తింపు దక్కిందని తెలిపారు. తన తండ్రి నుంచి నేర్చుకున్న "ప్రజా సేవయే మాధవ సేవ" అనే సూత్రాన్ని జీవితాంతం పాటిస్తూ ప్రజా సేవలో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్ష పదవిని కేవలం హోదాగా కాకుండా, తెలంగాణలోని సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే బాధ్యతగా భావిస్తున్నానన్నారు. గ్రామాల అభివృద్ధి, సర్పంచుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ప్రదీప్ జీ స్పష్టం చేశారు. తనను ప్రోత్సహించిన చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అందించిన సహకారం, మార్గదర్శకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని, గ్రామాల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తానని భీమిడి ప్రదీప్ జీ తెలిపారు. తన చివరి శ్వాస వరకు ప్రజా సేవకు అంకితమై పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కు రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పెంటాగౌడ్, నర్సింహులు, జనరల్ సెక్రెటరీ కరణం కీర్తి రామకృష్ణ, మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చేవెళ్ల రేఖ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న పాల్గొని భీమిడి ప్రదీప్ జీకి అభినందనలు తెలిపారు.





# అసెంబ్లీకి పసిబిడ్డతో విజయ్ పార్టీ ఎమ్మెల్యే..

**తమిళనాడు అసెంబ్లీకి పసిబిడ్డతో టీవీకే ఎమ్మెల్యే పల్లవి**

**సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన.. కొందరు మద్దతు, కొందరు విమర్శ**

**బిడ్డను ఇంట్లో వదిలిరాలేనని స్పష్టం చేసిన ఎమ్మెల్యే**

**ఇబ్బందులు తెలియకుండా ట్రోల్ చేయడం సరికాదన్న పల్లవి**

తమిళనాడు అసెంబ్లీ సమావేశాలకు ఓ మహిళా ఎమ్మెల్యే తన పసిబిడ్డతో హాజరవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆర్. పల్లవి, కొన్ని నెలల వయసున్న తన బిడ్డను ఎత్తుకుని సభా కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఈ ఉదంతంపై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో పల్లవి తన బిడ్డను సహాయకురాలి పర్యవేక్షణలో ఉంచి, విరామ సమయాల్లో పసికందు బాగోగులు చూసుకుంటున్నారు. అయితే, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు పసిబిడ్డను తీసుకువచ్చి అసౌకర్యం కలిగిస్తున్నారంటూ కొందరు ఆమెపై విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఒక తల్లిగా పసిబిడ్డను సంరక్షించుకుంటూనే, ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారంటూ పలువురు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు. ఈ విమర్శలపై ఎమ్మెల్యే పల్లవి స్పందించారు. "బిడ్డకు కొన్ని నెలలే వయసే కావడంతో ఇంట్లో వదిలి రావడం సాధ్యం కాదు. ఒక తల్లిగా నా బాధ్యతలను, ఎమ్మెల్యేగా నా విధులను ఏకకాలంలో నిర్వర్తించడంలో ఎలాంటి తప్పు లేదు. నేను కేవలం నా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాను తప్ప, ఎవరికీ ఇబ్బంది కలిగించాలనే ఉద్దేశం నాకు లేదు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేయడం సరికాదు" అని ఆమె స్పష్టం చేశారు.

## వందేమాతరంపై కంగన వ్యాఖ్యలు.. పాకిస్థాన్‌తో పోల్చడంపై కాంగ్రెస్ ఫైర్

బీజేపీ ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్‌పై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. జాతీయ గేయం 'వందేమాతరం' పట్ల కాంగ్రెస్ సీనియర్ నేతల వైఖరిని పాకిస్థాన్ ప్రజలతో పోల్చుతూ ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. మంగళవారం ముంబైలో ఓ ఆలయాన్ని సందర్శించిన అనంతరం కంగన మీడియాతో మాట్లాడుతూ, "వందేమాతరం భారతదేశ చైతన్యాన్ని సూచిస్తుంది. దానిపై ఇంతటి ద్వేషం చూపడం, ఆలపిస్తుంటే అడ్డుకోవడం ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్‌లోని ప్రజలు కూడా బహుశా ఇలా స్పందించరేమో" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ కేవలం బీజేపీ వ్యతిరేకిగానే కాకుండా, దేశ వ్యతిరేకిగా మారుతోందని ఆమె ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే మాట్లాడుతూ, "కంగనాను బీజేపీనే పెద్దగా పట్టించుకోదు. ఆమెకు మంచి వైద్యుడిని చూపించాలని నేను బీజేపీకి సలహా ఇస్తున్నాను. రోజురోజుకు ఆమె మానసిక స్థితి క్షీణిస్తోంది" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ కూడా కంగనపై విమర్శలు గుప్పించారు. "2014లోనే దేశానికి అసలైన స్వాతంత్ర్యం వచ్చిందని గతంలో వ్యాఖ్యానించిన వ్యక్తి ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడటమా?" అని ఆయన ప్రశ్నించారు. జాతీయ జెండా, రాజ్యాంగం విషయంలో ఆర్‌ఎస్‌ఎస్ చరిత్రను గుర్తుచేస్తూ, కనీసం స్వాతంత్ర్య పోరాట చరిత్ర పుస్తకాలనైనా ఆమె చదవాలని హితవు పలికారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గేయాలాపన సందర్భంగా పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత సోనియా గాంధీ ప్రవర్తనకు సంబంధించిన పరిణామాలతో మొదలైంది.

## మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి మధ్య తీవ్ర వాగ్వాదం

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో చోటుచేసుకున్న ఈ ఘటన, ఇరు పార్టీల మధ్య నెలకొన్న రాజకీయ వేడికి అద్దం పట్టింది. ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కింద కుట్టు మిషన్ల పంపిణీతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ, నియోజకవర్గంలో రూ. 2.50 కోట్లతో సమేల రోడ్డు, రూ. 1.50 కోట్లతో పాతగూడ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ, పనులు ఎందుకు ప్రారంభం కాలేదని మంత్రిని ప్రశ్నించారు. స్వయంగా మంత్రి ప్రారంభించిన పనులకే ఈ పరిస్థితి ఎదురైతే అభివృద్ధి ఎలా సాధ్యమని ఆమె నిలదీశారు. దీనిపై మంత్రి జూపల్లి స్పందిస్తూ, 2018 నుంచి 2023 మధ్య కాలంలో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్ని ఇళ్లు నిర్మించారో చెప్పాలని ఎమ్మెల్యేను ఎదురు ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం ముదిరింది. గత ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి, రైతుబంధు వంటి ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేశామని, మంత్రి వ్యాఖ్యలు సరికాదని కోవ లక్ష్మి కౌంటర్ ఇచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ, గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 8.25 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. రాష్ట్ర ఖజానా నుంచి ప్రతి నెలా రూ. 6,000 కోట్లు కేవలం వడ్డీల చెల్లింపులకే ఖర్చవుతున్నాయని, ఈ కారణంగానే అభివృద్ధి పనుల్లో కొంత జాప్యం జరుగుతోందని వివరించారు.

# వడ్డెర మహిళ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్న చంద్రబాబు

- వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఖరారు
- ఇచ్చిన మాట ప్రకారం రమాదేవికి ఈ అవకాశం కల్పించామన్న సీఎం చంద్రబాబు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు కేబినెట్ ఆమోదం
- మేయర్లు, మున్సిపల్ చైర్మన్లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు
- రాష్ట్రంలో కొత్తగా 28 జిల్లా ప్రజా పరిషత్తుల ఏర్పాటుకు నిర్ణయం



సామాజిక న్యాయం దిశగా ఎన్డీఏ ప్రభుత్వం చరిత్రాత్మక అడుగు వేసింది. అత్యంత వెనుకబడిన వర్గంగా ఉన్న వడ్డెర సామాజిక వర్గానికి చెందిన సాధారణ కార్యకర్త దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవిని ఖరారు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఇది కేవలం ఒక పదవి కాదని, వెనుకబడిన వర్గాల సాధికారత పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇద్దరికి ఎమ్మెల్సీ పదవులు ఇవ్వగా, అందులో ఒకటి అత్యంత వెనుకబడిన వడ్డెర కులానికి చెందిన మహిళకు కేటాయించడం ద్వారా ఇచ్చిన మాటకు కట్టుబడ్డామని చంద్రబాబు ఉద్ఘాటించారు. రమాదేవి గురించి చంద్రబాబు సభలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఆ అమ్మాయి ఒక మామూలు కార్యకర్త, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. ఎన్నికల్లో ఆమెకు ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోయాం. కానీ, మొట్టమొదటిసారిగా వడ్డెర కులానికి చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఆరోజే మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం, చదువుకున్న మహిళ అయిన రమాదేవిని ఈరోజు శాసనమండలికి తీసుకుంటున్నాం" అని వివరించారు. ఎస్సీ వర్గానికి చెందిన వర్ల రామయ్యతో పాటు, బీసీ వర్గానికి చెందిన రమాదేవికి ఎమ్మెల్సీ పదవులు ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని ఆయన తెలిపారు. ప్రాణాలు పోగొట్టుకున్నా సిద్ధాంతాన్ని వదులుకోని ఎందరో బీసీ కార్యకర్తల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకుంటున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ చారిత్రక నిర్ణయంతో పాటే, బీసీల రాజకీయ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే మరికొన్ని కీలక నిర్ణయాలను కేబినెట్ ఆమోదించినట్లు చంద్రబాబు వెల్లడించారు. బీసీల రాజకీయ ఎదుగుదలకు గొడ్డలిపెట్టుగా మారిన గత ప్రభుత్వ నిర్ణయాలను సరిదిద్దుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు తిరిగి 34% రిజర్వేషన్లను పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34%, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33% రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టపరమైన బలం చేకూరుస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించడం వల్ల దాదాపు 16,800 మంది బీసీలు నాయకత్వ అవకాశాలను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పట్టణాల్లో సుస్థిర పాలన కోసం మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పరిపాలనా వికేంద్రీకరణను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న 13 జిల్లా ప్రజాపరిషత్తుల స్థానంలో 28 జెడ్పీలను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ నిర్ణయాలు బీసీలకు భిక్ష కాదని, భాగస్వామ్యం కల్పించడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## టిస్ స్నాతకోత్సవం.. ముఖ్య అతిథిగా సీజేఐకి బదులు మరొకరు!



ప్రతిష్ఠాత్మక టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) తమ 86వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిని మార్చింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్థానంలో టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్. ప్రమేశ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు సంస్థ ప్రకటించింది. గతంలో వాయిదా పడిన ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 22న ముంబైలోని డియోనార్ క్యాంపస్‌లో నిర్వహించనున్నారు. వాస్తవానికి ఈ స్నాతకోత్సవం ఆగస్టు 2న జరగాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల కార్యక్రమానికి రెండు రోజుల ముందు దీనిని వాయిదా వేశారు. అయితే, ప్రధాన న్యాయమూర్తి పర్యటన సందర్భంగా విద్యార్థుల నుంచి నిరసనలు వ్యక్తమవుతాయనే ఆందోళనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆకస్మిక వాయిదాతో ప్రయాణ, వసతి ఏర్పాట్లు చేసుకున్న విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వారికి జరిగిన ఆర్థిక నష్టాన్ని భర్తీ చేస్తామని సంస్థ హామీ ఇచ్చింది. గతంలో జస్టిస్ సూర్యకాంత్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు, విద్యార్థుల నిరసనలపై పోలీసు చర్యలను సమర్థించడం వంటి అంశాలు వివాదానికి దారితీశాయి. ఇదే తరహాలో హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ఆయనను ఆహ్వానించడాన్ని కూడా వందలాది మంది విద్యార్థులు వ్యతిరేకించారు. మరోవైపు, నవంబర్ వరకు తన షెడ్యూల్ బిజీగా ఉన్నందున కొత్త తేదీల్లో హాజరు కాలేనని ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం టిస్ యాజమాన్యానికి తెలియజేసినట్లు సమాచారం.

## ఏపీలో సినిమా షూటింగ్స్‌కు ఉచిత అనుమతులు.. మంత్రి కందుల దుర్గేశ్

**సింగిల్ విండో విధానంలో వేగంగా క్లియరెన్స్**

**విజయవాడను సినీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు**

**వెండితెర-ఓటీటీ అవార్డుల కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్ ప్రకటన**

**సినీ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ సహకారం**



ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో సినిమా షూటింగ్‌లకు ఉచితంగా, సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తామని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రకటించారు. విజయవాడలో నిర్వహించిన 'వెండితెర -- ఓటీటీ అవార్డ్స్ 2025-26' కార్యక్రమంలో ఆయన ఈ ప్రకటన చేశారు. విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో 'విబి ఎంటర్‌టైన్‌మెంట్స్' సంస్థ 'సేవ్ ఆర్టిస్ట్ -- సేవ్ టాలెంట్' నినాదంతో ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. ఈ వేడుకకు హాజరైన మంత్రి దుర్గేశ్, అవార్డు విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో ఏపీలో సినీ పరిశ్రమ విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. డబ్బింగ్, రీ-రికార్డింగ్ థియేటర్ల వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ తరహాలోనే విజయవాడను కూడా సినీ, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని సహజ సిద్ధమైన లొకేషన్లను చిత్ర పరిశ్రమ మరింతగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇదే కార్యక్రమంలో 'ఉత్తరం' చిత్రంలోని గీతాన్ని ఆవిష్కరించిన మంత్రి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిభావంతులైన కళాకారులను, సాంకేతిక నిపుణులను గుర్తించి సత్కరించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను ప్రశంసించారు.



## ఏఐ యుగంలో భారత్ నాస్కామ్ చైర్మన్ కీలక వ్యాఖ్యలు!

ఐటీ సంస్థల ఆదాయ వృద్ధి మెరుగుపడేలా చూడటం, అలాగే కంపెనీల్లో కృత్రిమ మేథ, సాంకేతికతల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రాధాన్యతనివ్వనున్నట్లు నాస్కామ్ కొత్త చైర్మన్‌గా నియమితులైన శ్రీకాంత్ వెలమకన్ని తెలిపారు. ఏఐ యుగంలో భారత్ మరింత మెరుగ్గా, దూకుడుగా పోటీపడేలా చూసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. టెక్నాలజీపై కంపెనీలు ప్రస్తుత స్థాయికి మించి వెచ్చించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. టెక్నాలజీ పురోగతి వల్ల మనుషుల కన్నా మెషిన్లు మెరుగ్గా పనులు పూర్తి చేయగలిగినా, మనుషులు పోషించాల్సిన పాత్ర ప్రాధాన్యత తగ్గిపోదని తెలిపారు. ఏఐ ఆధిపత్యం కనిపిస్తున్న తరుణంలో కూడా గత ఏడాది నికరంగా ఉద్యోగుల సంఖ్య పెరగడం సానుకూలాంశమని ఆయన పేర్కొన్నారు. ఏఐ పురోగతితో చిన్నా, పెద్ద కంపెనీలు తమ వ్యాపారాలను సరికొత్తగా తీర్చిదిద్దుకునేందుకు అసాధారణ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని శ్రీకాంత్ వివరించారు.

## ఒకేసారి రెండు బైకులు లాంచ్




క్లాసిక్ లెజెండ్స్ తాజాగా యెజ్డీ, బీఎస్ఏ బ్రాండ్స్ కింద స్క్రాంబ్లర్ మోటర్‌సైకిల్స్‌ని ప్రవేశపెట్టింది. వీటిలో యెజ్డీ స్క్రాంబ్లర్ 350 ప్రారంభ ధర రూ. 1,99,950గా ఉంటుంది. ఇది నాలుగు రంగుల్లో లభిస్తుంది. బీఎస్ఏ స్క్రాంబ్లర్ 650 ప్రారంభ ధర రూ. 3,24,950గా ఉంటుంది.కంపెనీ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ తరేజా గురువారం వీటిని ఆవిష్కరించారు. బీఎస్ఏ స్క్రాంబ్లర్ దేశీయంగా ఈ సెగ్మెంట్లో ఏకైక 650 సీసీ సింగిల్ సిలిండర్ వాహనమని సంస్థ తెలిపింది. ఈ రెండు వాహనాలకు 4ఏళ్లు లేదా 50,000 కి.మీ. స్టాండర్డ్ వారంటీ, 6 ఏళ్ల వరకు ఎక్స్‌టెండెడ్ వారంటీ, 8 ఏళ్ల వరకు రోడ్‌సైడ్ అసిస్టెన్స్ మొదలైనవి ఉంటాయి.

## వోల్వో కీలక ప్రకటన: రూ.లక్ష వరకు పెరగనున్న ధరలు!




వోల్వో కార్ ఇండియా.. 2026 మే 1 నుంచి తమ కార్ల ధరలను లక్ష రూపాయల వరకు పెంచుతున్నట్లు ధృవీకరించింది. ఇటీవల పెరుగుతున్న ఖర్చుల కారణంగా ఆడి, మెర్సిడెస్-బెంజ్, బీఎండబ్ల్యూ వంటి ఇతర లగ్జరీ బ్రాండ్‌లు కూడా ధరలను సర్దుబాటు చేయవలసి వస్తున్న నేపథ్యంలో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. వోల్వో భారత పోర్ట్‌ఫోలియోలో నాలుగు ప్రధాన మోడళ్లు ఉన్నాయి. అవి జుశ30, జుజ40, శజ60, శజ90. ప్రతి మోడల్‌కు సంబంధించిన నిర్దిష్ట ధరల పెంపులను కంపెనీ వెల్లడించనప్పటికీ, అన్ని వేరియంట్‌ల ధరలను గరిష్టంగా రూ.1 లక్షకు పరిమితం చేయనున్నట్లు సమాచారం.కొత్త ధరలు మే 1వ తేదీ నుంచి బుకింగ్‌లు, డెలివరీలకు వర్తిస్తాయి. అంటే అంతకు ముందు బుక్ చేసుకున్న లేదా కొనుగోలు చేసే కార్లకు పాత ధరలే వర్తిస్తాయి. కాగా వోల్వో కార్ ఇండియా దేశవ్యాప్తంగా 23 షోరూమ్‌లు మరియు 25 సర్వీస్ సెంటర్ల నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది.

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

శుక్రవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 982.71 పాయింట్లు లేదా 1.27 శాతం నష్టంతో 76,681.29 వద్ద.. నిఫ్టీ 275.10 పాయింట్లు లేదా 1.14 శాతం నష్టంతో 23,897.95 వద్ద నిలిచాయి. ఇమామి రియల్టీ లిమిటెడ్, ఖైతాన్ (ఇండియా) లిమిటెడ్, కంచి కర్పూరం లిమిటెడ్, శేఖావతి ఇండస్ట్రీస్ లిమిటెడ్ , మాస్క్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. ఆన్లాన్ హెల్త్‌కేర్ లిమిటెడ్, ఏబీ కాట్‌స్పిన్ ఇండియా లిమిటెడ్, యూటీఐ అసెట్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ లిమిటెడ్, ఖైతాన్ కెమికల్స్ ది ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ వంటివి నష్టాల జాబితాలో చేరాయి.

# మందగమనంలో దేశ జీడీపీ.. ఇండియా రేటింగ్స్ తాజా అంచనా




న్యూఢిల్లీ, ఆగస్టు 18: దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు మందగమనంలోకి జారుకుంటున్నదని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ చెప్తున్నది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) భారత జీడీపీ వృద్ధి 6.8 శాతానికే పరిమితం కావచ్చని మంగళవారం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26) 7.6 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం వల్ల పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులతో ఇంధన, ఆహార ద్రవ్యోల్బణం ముప్పు ఉందంటున్న ఇండియా రేటింగ్స్.. డాలర్‌తో పోల్చితే బలహీనపడుతున్న రూపాయి మారకం విలువ, ఎల్ నినో కారణంగా తగ్గిన వర్షపాతం వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తుండటం కూడా దేశ జీడీపీ వృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయని పేర్కొన్నది.

**బ్యారెల్ 85 డాలర్లు**

ఈ ఆర్థిక సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడాయిల్ రేటు సగటున 85 డాలర్లు పలుకవచ్చని ఇండియా రేటింగ్స్ ఏజెన్సీ అంచనా వేసింది. అలాగే ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో రూపాయి మారకం విలువ సగటున రూ.93.98గా ఉండొచ్చని ఈ ఫిచ్ గ్రూప్ అనుబంధ సంస్థ అంటున్నది. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తిని అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. అమెరికాకు అండగా ఉంటున్నాయని యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, ఒమన్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది మరి. మరోవైపు కీలకమైన హెర్ముజ్ జలసంధిలోనూ సరుకు రవాణాను అడ్డుకుంటున్నది. ఇది భారత్‌పై తీవ్ర ప్రభావాన్నే చూపుతున్నది. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. అందులో గల్ఫ్ దేశాల నుంచి వచ్చేది ఎక్కువే కావడంతో వార్ సెగ భారత్‌కు గట్టిగానే తగులుతున్నది.

**త్రైమాసికాల వారీగా..**

ఈ ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ అంచనాను వేసిన ఇండియా రేటింగ్స్.. త్రైమాసికాల వారీగా కూడా ప్రకటించింది. తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్‌లో 6.9 శాతంగా, రెండో త్రైమాసికం జూలై-సెప్టెంబర్‌లో 6.6 శాతంగా, మూడో త్రైమాసికం అక్టోబర్-డిసెంబర్‌లో 6.7 శాతంగా, నాల్గో త్రైమాసికం జనవరి-మార్చిలో 6.9 శాతంగా ఉండొచ్చన్నది. కాగా, ఆర్బీఐ ఇటీవల ఈ త్రైమాసికాల్లో జీడీపీ వృద్ధిరేటు వరుసగా 7, 6.4, 6.5, 6.8 శాతంగా ఉండొచ్చని అంచనా వేసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే ముడి చమురు ధరలు సగటున ఏప్రిల్-జూన్‌లో బ్యారెల్ 101.31 డాలర్లుగా నమోదయ్యాయని, ఏప్రిల్-జూలైలో 96.49 డాలర్లుగా ఉన్నట్టు ఇండియా రేటింగ్స్ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర పంత్ తెలిపారు. అయితే చమురు ధరలు తగ్గుముఖం పడితే దేశ వాణిజ్య, కరెంట్ ఖాతా లోటు దిగొస్తుందని ఆయన గుర్తుచేశారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం రిటైల్ ద్రవ్యోల్బణం సగటు 4.9 శాతంగా ఉండొచ్చని, కరెంట్ ఖాతా లోటు జీడీపీలో 1.5 శాతానికి పెరుగవచ్చని అన్నారు.

## కొనసాగుతున్న సూచీల నష్టాలు




ముంబై, ఆగస్టు 18: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. పశ్చిమాసియాలో దౌత్యపరమైన పురోగతికి సంబంధించి ఆశలు క్షీణించడం పెట్టుబడిదారుల మనోభావాలను దెబ్బతీసింది. ఫలితంగా మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ మంగళవారం కూడా భారీగా నష్టపోయింది. క్రూడాయిల్ ధరలు భగ్గుమంటుండటం కూడా నష్టాలను మరింత పెంచాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 492.70 పాయింట్లు కోల్పోయి 77,235.46 వద్ద స్థిరపడింది. సూచీలు వరుసగా నష్టపోవడం ఇది మూడోసారి. అలాగే మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ వరుసగా ఆరోరోజూ 132.75 పాయింట్లు నష్టపోయి 24,154.90 వద్దకు జారుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 91 డాలర్లు దాటడం మదుపర్లలో ఆందోళన నెలకొన్నదని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

**టాటా గ్రూపు షేర్లు డౌన్**

టాటా గ్రూపునకు చెందిన కంపెనీల షేర్ల పతనం కొనసాగింది. టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్ షేరు 2.28 శాతం నష్టపోగా, టాటా కెమికల్స్ 1.63 శాతం, టీసీఎస్ 1.47 శాతం, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ 1.25 శాతం, వొల్టాస్ 1.10 శాతం, టాటా కమ్యూనికేషన్స్ 1 శాతం వరకు మార్కెట్ వాటాను కోల్పోయాయి. వీటితోపాటు టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా స్టీల్, టైటాన్, టాటా పవర్, ట్రెంట్ షేర్లు కూడా పతనం చెందాయి. టాటా సన్స్ ఏజీఎం కోరం లేకపోవడంతో ఏజీఎం వాయిదాపడటం షేర్ల పతనానికి ప్రధాన కారణం.

## ఆన్‌లైన్ గేమింగ్‌కు కొత్త రూల్స్..

న్యూఢిల్లీ: నానాటికీ విస్తరిస్తున్న దేశీయ ఆన్‌లైన్ గేమింగ్ రంగం.. కొత్త రెగ్యులేటరీ కిందికి వెళ్లబోతున్నది. ఎప్పట్నుంచో వేచిచూస్తున్న ఆన్‌లైన్ గేమింగ్ నిబంధనలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఎట్టకేలకు బుధవారం ప్రకటించింది. వచ్చే నెల మే నుంచి ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ రూల్స్ అమల్లోకి వస్తాయని ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ విలేకరులకు తెలిపారు. దీంతో గేమింగ్ ఎకోసిస్టమ్‌లో పారదర్శకత, జవాబుదారీతనం, యూజర్ల భద్రత వంటివి పెరుగుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల కార్యకలాపాలు, డాటా, కంటెంట్‌పైనా నియంత్రణ ఉంటుందని ఇండస్ట్రీ విశ్లేషకులు అంటున్నారు ఈ క్రమంలోనే కొన్ని ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలై, మోసాల బారినపడి అమాయకులు చనిపోతున్న దృష్ట్యా రూల్స్ కఠినంగానే ఉండాల్సిన అవసరం ఉందని కూడా వారు అభిప్రాయపడుతుండటం గమనార్హం. ఇదిలావుంటే రియల్ మనీ గేమ్స్‌కాని చాలా ఆన్‌లైన్ గేమ్స్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి కాదన్నారు కృష్ణన్. అయితే ఈస్పోర్ట్స్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. మొత్తానికి తాజాగా విడుదలైన ఈ నిబంధనల నేపథ్యంలో భారతీయ ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ రానున్నది. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి దీనికి చైర్‌పర్సన్‌గా ఉంటారు. ఇందులో ఎక్స్ అఫీషియో సభ్యులుగా కేంద్ర హోం, ఆర్థిక, క్రీడ, న్యాయ తదితర కీలక మంత్రిత్వ శాఖల జాయింట్ సెక్రటరీలు వ్యవహరిస్తారు.



# ఒకే నెలలో 46 వేల ఉద్యోగాలు కట్..

ఐటీ అనుబంధ సంస్థల్లో భారీ స్థాయిలో లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. ఏఐ కారణంగా ఆయా సంస్థల్లో వేలాది మందిని ఉద్యోగంలోంచి తొలగిస్తున్నారు. త్వరలో టాప్ కంపెనీల్లో కూడా భారీగా కోతలు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ సంస్థలు కలిసి వచ్చే జూన్‌లో భారీగా ఉద్యోగుల్ని తొలగించబోతుంది. ఈ మూడు సంస్థలు కలిసి జూన్‌లో ఏకంగా 46,750 మంది సిబ్బందిని తొలగించబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత మార్చిలో కూడా అనేక సంస్థలు ఉద్యోగుల్ని తొలగించాయి. ఏఐ టెక్నాలజీ మీద పెట్టుబడులకు సిద్ధమవ్వడం, కంపెనీలో నిర్మాణాత్మక మార్పుల కారణంగా ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు కంపెనీలు చెబుతున్నాయి. ఒకవైపు తమ కంపెనీలు వృద్ధి బాటలోనే నడుస్తున్నాయని చెబుతూనే, భవిష్యత్తు బాగుంటుందని చెబుతూనే ఉద్యోగుల్ని తొలగిస్తుండటం విశేషం. మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ సంస్థలు కూడా ఇప్పుడు ఇంకో 46,750 మందిని తొలగించబోతుండటం ఆసక్తికరంగా మారింది. మెటా సంస్థ తన కంపెనీలో పని చేస్తున్న వారిలో పది శాతం మంది ఉద్యోగుల్ని.. అంటే కనీసం 8,000 మందిని తొలగించాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా కొంతమందిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలి అని ఇంతకుముందు తీసుకున్న నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఇదే సమయంలో ఏఐ టెక్నాలజీపై మెటా భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఈ ఏడాది 135 బిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేయాలని కంపెనీ నిర్ణయించింది. అంటే, గత మూడేళ్లలో కంపెనీ ఏఐ మీద పెట్టుబడి పెట్టిన దానితో సమానం. ఏఐ టెక్నాలజీ సిబ్బంది అవసరాన్ని తగ్గిస్తుందని గతంలోనే మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ప్రకటించారు. ఒరాకిల్ సంస్థ కూడా 30,000 మందిని తొలగించబోతుంది. ఇప్పటికే కొందరికి దీనికి సంబంధించిన మెయిల్స్ వచ్చినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. మెయిల్ వచ్చినప్పటి నుంచే ఉద్యోగంలోంచి తొలగిస్తారు. మరోవైపు మైక్రోసాఫ్ట్ సంస్థ 8,750 మంది సిబ్బందిని తొలగించాలని నిర్ణయించింది. అంటే సంస్థలో 7 శాతం సిబ్బందిని తొలగించబోతుంది. అయితే, సిబ్బందికి వాలంటరీ రిటైర్‌మెంట్ అవకాశం కల్పిస్తోంది. మైక్రోసాఫ్ట్ స్థాపించిన 51 ఏళ్లలో ఇలాంటి ప్రతిపాదన తీసుకురావడం ఇదే మొదటిసారి.







# ముగ్గురు బ్యూటీస్ నాగ్ కోసం..

తెలుగు సీనియర్ హీరోల్లో నాగార్జున సరైన సక్సెస్ చూసి చాలాకాలమైంది. గతేడాది కుబేర్, కూలీ సినిమాల్లో కాస్త డిఫరెంట్ పాత్రలు చేసి ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం హీరోగా 100వ మూవీ చేస్తూ బిజీగా ఉన్నాడు. ఈ మూవీ గురించి సోషల్ మీడియాలో తప్పితే అధికారికంగా ఎలాంటి అప్‌డేట్స్ రావడం లేదు. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ల గురించి డిస్కషన్ నడుస్తోంది. ఏకంగా ముగ్గురు బ్యూటీస్ నాగ్ సరసన నటించబోతున్నారట. గతంలో నిన్నే పెళ్లాడతా లాంటి సినిమాలో కెమిస్ట్రీతో అదరగొట్టిన నాగ్–టబు.. ఈ సినిమా కోసం మళ్లీ కలుస్తున్నారట. చాన్నాళ్ల క్రితమే ఈ రూమర్ బయటకొచ్చింది. కానీ నిజమా కాదా అనేది మాత్రం క్లారిటీ రాలేదు. తాజాగా 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ ఐశ్వర్య రాజేశ్ కూడా మరో కథానాయికగా ఎంపికైందని అంటున్నారు. వీళ్లిద్దరితో పాటు సుస్మితా భట్ అనే తమిళ బ్యూటీ కూడా ఇందులో ఉందని టాక్ వినిపిస్తోంది. తమిళ దర్శకుడు ఆర్.కార్తిక్ తీస్తున్న ఈ సినిమా లాటరీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా తీస్తున్నారని తెలుస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ అనుకుంటున్నారట. ఈ ?స్టోరీని గట్టిగా నమ్మిన నాగ్.. తనే స్వయంగా నిర్మిస్తున్నారు కూడా. ఏదేమైనా నాగ్ సరసన ముగ్గురు హీరోయిన్లు అనే రూమర్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర టాపిక్ అయిపోయింది.ఖ

# బాల్రెడ్డి ఆయన.. బామ్మర్ది ఈయన?

టైటిల్ నుంచే సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతుంటారు దర్శకుడు అనిల్ రావిపూడి. తొలి సినిమా 'పటాస్' నుంచి చూస్తే.. ఆయన టైటిల్స్ అన్నీ ప్రత్యేకంగానే ఉంటాయి. ప్రస్తుతం ఆయన వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్‌ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాక్కూడా ఆయన భిన్నమైన పేరునే నామకరణం చేసినట్టు తెలుస్తున్నది. ఇది రాయలసీమ ఫ్యాక్షన్ నేపథ్యంలో సాగే కామెడీ ఎంటర్‌టైనర్ కావడంతో ఈ సినిమాకు 'బాల్రెడ్డి బామ్మర్ది' అనే క్యాచీ టైటిల్‌ని అనిల్ ఖరారు చేశారట. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది. సంక్రాంతికి విడుదల కానున్న ఈ సినిమాలో వెంకీ సరసన కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్‌రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించనున్నది. షైన్ స్క్రీన్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.





# ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదు నిర్మొహమాటంగా చెప్పి సాయిపల్లవి

దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచారు. డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. చిన్నప్పటి నుంచే నాట్యం, నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ చదువును ప్రాధాన్యంగా తీసుకుని మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన సాయి పల్లవి, ప్రేమమ్ సినిమాలో 'మలర్ టీచర్' పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన, తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు 'లేడీ పవర్ స్టార్' అనే ట్యాగ్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్ తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రామాయణం లో సీత పాత్ర పోషించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. 'ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఎలాంటి ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది. ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురుచూస్తున్నారు.


# రామ్‌చరణ్‌కు జోడీగా?

బ్లాక్‌బస్టర్ 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న సినిమా కావడంతో (వర్కింగ్ టైటిల్)పై షూటింగ్ ప్రారంభానికి ముందే అభిమానుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి. ఈ సినిమాలో కథానాయికగా రష్మిక మందన్నా, రుక్మిణీవసంత్‌ల పేర్లు మొన్నటివరకూ బలంగా వినిపించాయి. తాజాగా ఈ జాబితాలోకి 'దురంధర్' బ్యూటీ సారా అర్జున్ కూడా చేశారు. ఈ సినిమాలో కథానాయికగా సారా దాదాపు ఖరారైనదంటూ ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. వచ్చే నెలలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్టు వినికిడి. హై ఓల్టేజ్ స్టైలిష్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈచిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ నిర్మించనున్నది. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు.



# 'సిగ్మా' విడుదల అప్పుడే

సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ 'సిగ్మా'. జాసన్ సంజయ్ దర్శకుడు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంగళవారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. గాంధీ జయంతి హాలిడేతో పాటు వీకెండ్ కూడా కలిసి రావడంతో ఈ డేట్ సినిమాకు మంచి అడ్వాంటేజ్ కానున్నదని మేకర్స్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో హీరో సందీప్ కిషన్ ఇంటెన్స్ అవతారంలో కనిపిస్తున్నారు. కిటికీ నుంచి సూర్య కిరణాలు తనని తాకుతుండగా, ఆ వెలుతురులో కనిపిస్తున్న అతని లుక్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నది. ఆయన పక్కనే ఓ కుక్క కూడా ఉండటం గమనార్హం. ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, సంపత్‌రాజ్, శివ పండిట్, అన్బు థాసన్, యోగ్ జపే తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: క్రిషన్ వసంత్, సంగీతం: ఎస్.థమన్.



Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No:**